ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



## (భీమవరంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 4-5-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఆధ్యాత్మికవిద్య అంటే ఎందుకు పనికిరానిది అని అనుకోవద్దు. మన దైనందిన జీవితంలో అందరికి ఉపయోగపడుతుంది. మనకు శరీరం ఉంది, మనస్సు ఉంది. శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఈ ఆధ్యాత్మికవిద్య మానసిక ఆరోగ్యమును పెంచుతుంది, వివేకమును పెంచుతుంది. కొంతమంది ఏ పని చేసినా వ్యక్తిపరంగా చేస్తారు, సమాజపరంగా చేయరు. ఆధ్యాత్మికవిద్య వ్యక్తిభావనను తగ్గిస్తుంది. మన చైతన్యస్థాయి పెరగటానికి ఆధ్యాత్మిక విద్యసహకరిస్తుంది. మనలో మంచితనం ఉంటే దానిని ప్రాక్టీస్ చేయాలి లేకపోతే ఆమంచితనం యొక్క ఉపయోగం లేదు. భక్తి చాలా ముఖ్యం. మానవజన్మవచ్చి భక్తి లేకుండా ఉండటం కంటే జంతుశరీరం వచ్చినా భక్తి కలిగి ఉంటే మంచిది. భగవదనుగ్రహం లేకపోతే మనకు భక్తి కలుగదు. భగవంతుని నిరంతరము స్మరించటం వలన, భగవంతునికి ఇష్టమైన పనులు చేయటం వలన మనపట్ల ఆయనకు అనుగ్రహం కలుగుతుంది. మనపట్ల ఆయనకు అనుగ్రహం ఎప్పుడైతే కలిగిందో మనకు అసాధ్యం అంటూ ఏమీ ఉండదు. ప్రతీ విషయం సాధ్యమవుతుంది. ఆయన అనుగ్రహం లేకుండా ఆయన స్వరూపాన్ని మనం పొందలేము. మనమాట, చేత, ఆలోచన సమానంగా ఉండాలి. వీటికి సమన్వయం ఉండాలి. మన మనస్సు, మాట, చేత ఏకంగా ఉంటే, త్రికరణశుద్ధిగా ఉంటే మనం ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. మంచి పనులు చేయటం వలన, మంచి ఆలోచనలు మనబ్రెయిన్‌లోనికి తీసుకొని రావటం వలన, సత్పురుషుల సహవాసం వలన ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. మన జీవిత విధానాన్ని భగవంతుడు చెప్పినట్లు తీర్చిదిద్దుకుంటే మన హృదయంలో ఉన్న శాంతి, ఆనందం సుఖం మన సహస్రారానికి అందుతుంది. ఇప్పుడు మనం ప్రతీదానికి ఇతరుల మీద ఆధారపడి జీవిస్తున్నాము. హృదయంలో ఉన్న ఆనందం మనకు అందుతూ ఉంటే మనం స్వతంత్రులము అవుతాము. అప్పుడు దేనికీ ఇతరుల మీద ఆధారపడవలసిన పనిలేదు. వ్యక్తిభావన లేకుండా జీవించటం నేర్చుకొంటే తప్పనిసరిగా ఈ జన్మలోనే, ఇక్కడ ఉండగానే మధ్యవర్తులతో సంబంధం లేకుండా మన హృదయంలో ఉన్న శాంతి మనకు అందుతుంది.

భౌతికమైన అభివృద్ధికి, ఆధ్యాత్మిక అభివృద్ధికి కూడా వినయం అవసరం. అవినయం రాకుండా చూసుకోవాలి. మనకు అవినయం వస్తే భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను కూడా పతనమవుతాము. ఈలోకంలో సుఖపడము, పరలోకంలో కూడా అశాంతి మిగులుతుంది, దుఃఖం మిగులుతుంది. అందువలన ఎట్టిపరిస్థితులలో కూడా అవినయం రాకుండా చూసుకోవాలి. మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు భగవంతుని మర్చిపోతాము. ప్రతికూలంగా ఉన్నప్పుడు భగవంతుని

స్మరించుకొంటాము. ఇది మన అజ్ఞానానికి గుర్తు. మనలో దేహానికి పరిమితమైన బుద్ధి ఉన్నంత కాలం మనకి అజ్ఞానం ఉన్నట్లే. భగవంతుని ప్రార్థించినా, నిష్కామకర్మచేసినా, సత్పురుషులతో సహవాసం చేసిన అజ్ఞానంలో నుండి విడుదల పొందటానికే. దేహాలువస్తూ ఉంటాయి, పోతూఉంటాయి. మనస్సు ఒక అవస్థలో ఉంటుంది, ఒక అవస్థలో ఉండదు. కాని దేహానికి అతీతంగా, మనస్సుకు అతీతంగా ఈలోకానికి అతీతంగా ఒక చావులేని వస్తువు నీ హృదయంలో ఉంది. నీ దేహానికి చావురాకముందే నీవు ఆ చావు లేని వస్తువును పొందితే నీవు చావులేని స్థితిని పొందుతావు. జ్ఞానం ఉంటే మనం ఎవరికీ భయపడనక్కరలేదు, అభయంగా ఉండవచ్చు. కాని ధనం ఉంటే అందరికీ భయపడాలి. దొంగలకే కాదు మన ఇంట్లో ఉన్న వ్యక్తులకు కూడా భయపడాలి. ఇది ధనం యొక్క స్వభావం, అది జ్ఞానం యొక్క స్వభావం అని ఆచార్యులవారు చెప్పారు. నీ హృదయంలో ఉన్న చావులేనిస్థితి నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు నీకు అభయస్థితి కలుగుతుంది. అప్పటి వరకు ఏదోరకమైన భయం నిన్ను వెంటాడుతుంది. కోట్లాదిమంది జనం ఉన్నారు. ఎవరైనా నూటికి నూరుపాళ్ళు సుఖంగా ఉన్నారా? అందరికి ఏదోరకమైన వెలితి ఉంటుంది. మానవుడిని దుఃఖంలేని స్థితికి తీసుకొనివెళ్ళటానికే ఆచార్యులవారు, బుద్ధుడు ఇంకా అనేకమంది మహాత్ములు ప్రయత్నం చేసారు. ధనం మనకు భోగం తీసుకొని వస్తుందికాని దుఃఖరహితమైన స్థితికి తీసుకొనివెళ్ళలేదు.

జ్ఞానం సంపాదించాలంటేడబ్బు అక్కరలేదు, గౌరవం అక్కరలేదు. నీకు తెలుసుకోవాలనే కాంక్ష ఉంటే చాలు నీవు జ్ఞానివి అయిపోతావు. తెలుసుకోవాలనే కాంక్ష ఉంటే అదేపెట్టుబడి. ఆకాంక్ష నిన్ను ఉన్నత శిఖరాలకు తీసుకొనిపోతుంది. మనం భగవంతుని నోటితో స్తోత్రం చేస్తాము. చేతులతో చేసేటప్పుడు అది కాదంటాము. అంటే నోటితో చెప్పేది వేరు, చేతితో చేసేదివేరు. మనచేతులకు, మననోటికి సమన్వయం లేదు ఇంక మనకు జ్ఞానం ఎలా కలుగుతుంది. మీరు పెద్దకష్టపడనక్కరలేదు, డబ్బు ఖర్చుచేయనక్కరలేదు. గుడులు చుట్టూ తిరగనక్కరలేదు. మన లోపల ఉన్న దేహబుద్ధికి ఆహారం అందకుండాచేస్తే మీకు జ్ఞానం కలుగుతుంది. నేను మిమ్మల్ని పొగిడితే మీకు ఆనందం కలుగుతుంది, మిమ్మల్ని విమర్శిస్తే మీకు దుఃఖం కలుగుతుంది. నేను పొగిడినప్పుడు మీకు సంతోషంవచ్చినా, నేను విమర్శించినప్పుడు మీకు దుఃఖం వచ్చినా మీ దేహబుద్ధికి ఆహారం అందుతుంది. మీ దేహబుద్ధికి ఆహారం అందకుండా చూస్తే మీరు పెద్ద పెద్ద తపస్సులు చేయనక్కరలేదు, మీకు జ్ఞానం కలుగుతుంది. మీకు మోక్షం కావాలంటే ఏక్షన్ ఉండాలి, రియాక్షన్ ఉండకూడదు. ప్రతీ చిన్న విషయానికి రియాక్టు అవుతూ ఉంటే వినయం పోతుంది, అవినయం వస్తుంది. అవినయం వస్తే భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను పతనం ప్రారంభమవుతుంది.

ఇక్కడ బ్యాంకలలో అందరూ డబ్బువేసుకొంటున్నారు. దేహపోషణకు అది అవసరమే. అలాగే దేవుని బ్యాంక్‌లో కూడా కొంత డబ్బువేసుకోండి. ఇక్కడ బ్యాంక్‌లో ఉన్న డబ్బు నీ మరణానంతర జీవితంలో ఉపయోగపడదు. దేవుని బ్యాంక్‌లో వేసినది నీ మరణానంతర జీవితంలో ఉపయోగపడుతుంది. మీరు ఇతరులకు ఏదైనా సహాయంచేస్తే అది ఏరూపంలో చేసినా అది దేవుని బ్యాంక్‌లో పడుతుంది. దేవుని బ్యాంక్‌లో వేసినది మరణానంతర జీవితంలో

ఉపయోగపడుతుంది. అందువలన కొన్ని మంచి పనులు చెయ్యి అది దేవుని బ్యాంక్‌లో పడుతుంది. మన దేహప్రారబ్ధాన్ని బట్టి భగవంతుడు ఒకో మనిషికి ఒకోరకమైన పనిఇస్తాడు. ఆపనిని సక్రమంగా చెయ్యి. మీరు చేసే పని ప్రేమగా, ఇష్టంగా చెయ్యండి. మీ అత్తగారు మీ ఇంటి దగ్గర ఉన్నారు అనుకోండి. కొంత మంది విసుగుగా చూస్తారు. అలావద్దు మీకు చూడటం ఎలాగు తప్పదు. ఆచూసేది ప్రేమగా, ఇష్టంగా చూడండి. ఆపనిలో దేవుని చూడండి అలాచేస్తే పాతవాసనలు పోతాయి, కొత్త వాసనలు రావు, రాబోయే జన్మకు హేతువులు ఏమైనా ఉంటే అవిపోతాయి. ఎలాగైనా పనిచేయటం నీకు తప్పదు చేసేపని విసుగుగా కాకుండా ఇష్టంగా, ప్రేమగాచేస్తే మీకు భగవదనుగ్రహం కలుగుతుంది.

## (భీమవరంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 5-5-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

మానవుడు దుఃఖంలో నుండి, భయంలో నుండి విడుదల పొందాలంటే ఆత్మానుభవం సంపాదించాలి. బ్రహ్మానుభవం పొందినవాడికి నేను, నాది అనేది అర్థరహితములు. నేను అంటే అహంకారం అంటారు, నాది అంటే మమకారం అంటారు. ఇవి రెండూ చైతన్యంలో లేవు. ఇవి రెండు మనస్సులో ఉన్నాయి. ఇవి రెండూ నీ అశాంతికి కారణం. నీ మనస్సు అణిగితే ఇవి అన్నీ అణిగిపోతాయి. మనస్సును హృదయాకారం చెందింప చేయటానికి వైరాగ్యం, అభ్యాసం ఉండాలి. బలహీనులకు, బద్ధకస్తులకు ఆత్మజ్ఞానం కలుగదు అని ఉపనిషత్‌లలో చెప్పారు. ఆత్మజ్ఞానం కలుగకపోతే వాడి స్వరూపం వాడికి తెలియదు. వాడి స్వరూపం వాడికి తెలియకుండా స్వరూపసుఖం వాడికి అందదు. ఆత్మజ్ఞానం లేకుండా ఏ మనిషి సుఖిఅవ్వలేడు. వైరాగ్యము, అభ్యాసము ఒక దాని మీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. ఆత్మజ్ఞానం సంపాదించటానికి రెండూ అవసరమే. ఈ జన్మలో అయినా, ముందు జన్మలో అయినా నీ మార్గం ఏదైనా గురువు ఎవరైనా చిత్తశుద్ధి అనేగేటు ద్వారానే నిర్వాణ స్థితిలోనికి ప్రవేశించగలము. లోపలఉన్నవస్తువు ఎంత పవిత్రమైనదో మన మనస్సు అంత పవిత్రమైనప్పడు మాత్రమే అది తదాకారం చెందుతుంది. మన మనస్సుకు పవిత్రత లేకపోతే అది అంతర్‌ముఖం కాదు. అంతర్‌ముఖం కాకపోతే దానికి అంతర్‌దృష్టి కలుగదు. మనస్సుకు అంతర్‌దృష్టి లేకపోతే ఆత్మజ్ఞానం కలుగదు. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఒక్క ఆకర్షణకు లోబడిన నీవు పతనమవుతావు. ఆ ఆకర్షణలకు లోబడకుండా ఒక్క వైరాగ్యమే నిన్ను ఆపుచేస్తుంది. ఇంకో మార్గం లేదు. వైరాగ్యం ఉన్న మనిషికి మనస్సు బాహ్యాముఖంగా విజృంభించటం ఆగిపోతుంది. మనస్సు బాహ్యాముఖానికి విజృంభించటం ఆగిపోయిన వెంటనే అది మూలతలంపు యొక్క మూలంలోనికి ప్రయాణం చేయటం ప్రారంభిస్తుంది. నీవు ఏమార్గంలో ప్రయాణం చేసినా నీ మనస్సును తీసుకొని వెళ్లి ఆధ్యాత్మిక హృదయంలో ఉంచాలి. ఎప్పడైతే నీ మనస్సును ఆధ్యాత్మిక హృదయంలో ఉంచావో అది కాలి బూడిద అవుతుంది. మనం ప్రయత్నం చేసి సాత్విక బుద్ధిని అలవర్చుకోవాలి. సాత్వికబుద్ధిని అలవర్చుకొంటే ధ్యానం దాని అంతట అదే వస్తుంది. అప్పడు ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా

ఆనందమే.

ఏయోగం ద్వారా అయినా నీ మనస్సును అంతర్ముఖం చెయ్యి అని శాస్త్రం చెపుతోంది. ప్రాణాయామం నేర్చుకొనే వారు నేర్చుకోండి. నేర్చుకోలేనివారు మీ కంటే ఎక్కువ చైతన్యస్థాయి ఉన్నవారిదగ్గర, మహాత్ములదగ్గర, జ్ఞానుల సన్నిధిలో రోజూ ఒక గంట కూర్చొంటే మీకు తెలియకుండా కుంభకం వచ్చేస్తుంది. మీరు ఈ మాటలు నమ్మనక్కరలేదు. చేసి చూడండి మీకే తెలుస్తుంది. భగవంతుని స్మరించండి అని మన పెద్దలు చెపుతూ ఉంటారు. దానివలన మనకులాభం ఏమిటి? భగవంతుని స్మరిస్తూఉంటే, భగవంతుని దైవీగుణాలు మనకు గుర్తుకువస్తూఉంటే మనం పవిత్రులమవుతాము, మనం బాగుపడతాము అందుకు స్మరణ చేయమని పెద్దలు చెప్పారు. భగవంతుని స్మరిస్తే మనం పవిత్రులమవుతామని భగవంతుడే చెపుతున్నాడు ఇంక అనుమానం అనవసరం. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకోండి. మనకు జీవితంలో కష్టం ఎదురవుతూ ఉంటుంది సుఖం ఎదురవుతూఉంటుంది. కష్టం కొన్ని పాఠాలు నేర్పుతుంది, సుఖం కొన్ని పాఠాలు నేర్పుతుంది. కష్టంవచ్చినా, సుఖంవచ్చినా, మంచివచ్చినా, చెడ్డవచ్చినా, గౌరవంవచ్చినా అగౌరవంవచ్చినా ఎవడైతే తన మనస్సును సమానం చేసుకొంటాడోవాడు యోగి అవుతాడు.

మనం కష్టపడి, సాధనచేసి ఈశ్వరానుగ్రహం సంపాదిస్తే మనకు అన్నీ లభించినట్లే. అది లేకపోతే ఒకటి లేని సున్నలతో సమానము. ప్రేమలేని, భక్తిలేని పనులు ఎన్ని చేసినా ఒకటిలేని సున్నలకు ఎంత విలువ ఉంటుందో, వాటికి కూడా అంతే విలువ ఉంటుంది. కొంతమందికి ప్రతీచిన్నవిషయానికి అనుమానమే. అలా కాకుండా భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే ధృడవిశ్వాసం ఉంటే నీకు ఎన్ని దురలవాట్లు ఉన్నాకూడా అనుమానాలు పెట్టుకొని సాధనచేసే వారికంటే ముందునువ్వుబాగుపడతావు అని భగవంతుడు చెపుతున్నాడు. నీకు విశ్వాసం ఉంటే కొండలనుకూడా కదపగలవు. విశ్వాసం వలన అంత శక్తి వస్తుంది. నీవు ఎవరో నీకు తెలియనంతకాలం సందేహాలు వస్తూనే ఉంటాయి. అయితే సందేహాలు ఎప్పుడు పోతాయి అంటే నువ్వు ఎవరో నీకు తెలిసినప్పుడు ఈ సందేహాలు అన్నీ పోతాయి.

మనకు పని చేసిపెట్టేవాడు భగవంతుడు. కాని భగవంతుడు చేయటంలేదు అని మనం అనుకొంటాము. పని చేసేవాడు భగవంతుడు. ఆయన నిశ్శబ్ధంగా చేస్తాడు, గర్వం మనం పొందుతాము. భగవంతుడు చేసేపని మనకళ్ళకు కనబడటంలేదు ఎందుచేతనంటే మనకు కనబడాలని ఆయన అనుకోవటంలేదు. మనగుర్తింపును అయన కోరుకోడు ఇతరులకు తెలియాలి అని ఆయన అనుకోడు ఎందుచేతనంటే ఆయన దృష్టిలో ఇతరులు లేరు. మనమనస్సు అణిగిఉంటే జ్ఞానంతో, కాంతితో శాంతితో భగవంతుడు మనలను అలంకరిస్తాడు. ఏది తెలుసుకొన్నాక ఇంక తెలుసు కోవలసినది అంటూ ఏమీ మిగలదో దానిని తెలుసుకో. దానిని తెలుసుకొన్నాక దాని కంటే మించినది కాని, దానితోసమానమైనది కాని ఏదీ లేదు అని నీకే తెలుస్తుంది.